
పెన్ పవర్
రాయలసీమ
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా । తిరుపతి జిల్లా । చిత్తూరు జిల్లా । వై.ఎస్.ఆర్. కడప జిల్లా ।

# ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు భరోసా : ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి

**ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్యంతో బాధపడుతున్న పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) అండగా నిలుస్తోందని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అన్నారు.**






కోవూరు పెన్ పవర్ జూలై 3. శుక్రవారం నెల్లూరులోని కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయనిధి 26వ విడత చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మొత్తం 20 మంది లబ్ధిదారులకు రూ.8.38 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, అనారోగ్యం లేదా ఇతర అత్యవసర పరిస్థితుల వల్ల ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో ఊరటనిస్తోందని అన్నారు. అర్హులైన ప్రతి లబ్ధిదారికి ప్రభుత్వ సహాయం అందేలా నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. ఇప్పటి వరకు ముఖ్యమంత్రి సహాయనిధి కింద మొత్తం 921 చెక్కులను పంపిణీ చేసినట్లు వెల్లడించారు. వాటి ద్వారా రూ.9.32 కోట్ల ఆర్థిక సాయాన్ని లబ్ధిదారులకు అందజేసినట్లు పేర్కొన్నారు. పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని,అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు చేరేలా కృషికొనసాగిస్తామని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి స్పష్టం చేశారు

# రోసనూరు లో ఓటర్ల 'ఎస్ ఐ ఆర్' ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ



పెళ్లకూరు, పెన్ పవర్, జూలై 3 పెళ్లకూరు మండల పరిధిలోని రోసనూరు పంచాయతీలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియలో భాగంగా కీలక కార్యక్రమం నిర్వహించారు. పెళ్లకూరు తాసిల్దార్ హరికృష్ణ, బూత్ స్థాయి అధికారి (బీఎల్ఓ) కిషోర్ , బూత్ స్థాయి ఏజెంట్ (బీఎల్ఏ) ఎల్లు. మోహన్ ఆధ్వర్యంలో శుక్రవారం 'ఎస్ ఐ ఆర్' (ఓటర్ల ప్రత్యేక వివరాల సేకరణ) ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేశారు.?ఈ సందర్భంగా తాసిల్దార్ హరికృష్ణ మాట్లాడుతూ, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. గ్రామంలోని ఓటర్ల వివరాల నమోదు, మార్పులు చేర్పుల ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.?బీఎల్ఓ కిషోర్ , బీఎల్ఏ ఎల్లు. మోహన్ క్షేత్రస్థాయిలో పర్యటించి, స్థానికులకు ఫారాలను అందజేస్తూ వాటి స్వకరించారు ప్రాధాన్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక రెవెన్యూ సిబ్బంది, ప్రజాప్రతినిధులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఐటీ రంగంలోనూ నెల్లూరు ముందడుగు

## నగరానికి సాఫ్ట్వేర్ కంపెనీలు రావడం శుభపరిణామం
## సీఎం పిలుపు మేరకు ప్రతి ఇంటా ఒక పారిశ్రామికవేత్త ఎదగాలి
## నెక్సస్ ఇన్నోవేషన్ హబ్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి






నెల్లూరు పెన్ పవర్ జూలై 3. నెల్లూరులో మొట్టమొదటి మల్టీ-కంపెనీ ఏ ఐ ఇన్నోవేషన్ పార్క్ 'నెక్సస్ ఇన్నోవేషన్ హబ్' (నెక్సస్ ఇన్నోవాషన్ హెచ్ యు బి ) ప్రారంభోత్సవంలో కోవూరు ఎమ్మెల్యే శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ, వ్యవసాయం, ఆక్వాకల్చర్, పారిశ్రామిక రంగాల్లో ఇప్పటికే అభివృద్ధి చెందుతున్న నెల్లూరు జిల్లా ఇప్పుడు ఐటీ రంగంలోనూ ముందంజ వేయడం ఆనందదాయకమని అన్నారు. సాఫ్ట్వేర్ కంపెనీలను నెల్లూరుకు తీసుకొచ్చి నెక్సస్ ఇన్నోవేషన్ హబ్ని ప్రారంభించిన రెనిల్ రెడ్డి అభినందనలు తెలిపారు. ఈ హబ్ ద్వారా ఏర్పడుతున్న సంస్థలు రానున్న రోజుల్లో జిల్లాలోని యువతకు ఉ పాధి అవకాశాలు కల్పిస్తూ వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రతి ఇంటి నుంచి ఒక పారిశ్రామికవేత్త రావాలనే లక్ష్యంతో యువతను ప్రోత్సహిస్తున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అదే స్ఫూర్తితో యువత ఇలాంటి ఇన్నోవేషన్ హబ్లను సద్వినియోగం చేసుకుని తమ వినూత్న ఆలోచనలను స్టార్టప్లుగా మలచాలని సూచించారు. నెల్లూరులో ఐటీ, ఆవిష్కరణలు, స్టార్టప్లకు అనుకూల వాతావరణం ఏర్పడడం ద్వారా స్థానిక యువతకు సొంత జిల్లాలోనే ఉన్నత స్థాయి అవకాశాలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి వక్ఫ్ బోర్డు ఛైర్మన్ అజీజ్ నెక్సస్ ఇన్నోవేషన్ హబ్ వ్యవస్థాపకులు రెనిల్ రెడ్డి కోమిట్లతో పాటు పలువురు ప్రముఖులు, విద్యార్థులు, యువత పాల్గొన్నారు.

# 50% సబ్సిడీతో రైతులకు విత్తనాలు సరఫరా



పెళ్లకూరు, పెన్ పవర్, జూలై 3 మండల పరిధిలోని రైతు సేవ కేంద్రాల వద్ద రైతులకు పచ్చి రొట్ట, విత్తనాలు 50% సబ్సిడీతో అందుబాటులో ఉన్నాయి. మండలంలోని రైతులందరూ పచ్చిరొట్ట, విత్తనాలు తీసుకోవాల్సిందిగా మండల వ్యవసాయ అధికారి సిహెచ్. విజయభారతి తెలియజేశారు. మండలానికి 73 టన్నుల జీలుగలు, 19 టన్నుల పిల్లి పెసర అందుబాటులో ఉన్నాయి. జీలుగ ఒక కేజీ ధర సబ్సిడీతో 80 రూపాయలు, పిల్లి పెసర ఒక కేజీ ధర సబ్సిడీతో 98 రూపాయలతో పంపిణీ చేయడం జరుగుతుంది. ఈరోజు చిల్లకూరు రైతు సేవ కేంద్రంలో పచ్చిరొట్ట పంపిణీ కార్యక్రమం జరిగింది.

50 శాతం సబ్సిడీతో విత్తనాల పంపిణీ జరిగింది. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి సిహెచ్. విజయభారతి, ఏఈఓ పుటయ్య పాల్గొన్నారు.

# సామంతమల్లం చెరువుపై మట్టి మాఫియా?..

## అధికార పార్టీ నేతపై గ్రామస్తుల ఆరోపణలు

## నన్నెవ్వరూ అడ్డుకోలేరు అంటూ చెరువులో మట్టి తరలింపు
## చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు అధికారులకు విజ్ఞప్తి



సూళ్లూరుపేట, పెన్ పవర్, జూలై 3 సూళ్లూరుపేట మండలం సామంతమల్లం చెరువులో అక్రమంగా మట్టి తవ్వకాలు జరుగుతున్నాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గత వారం రోజులుగా ఒక జేసీబీ, సుమారు 20 ట్రాక్టర్లతో ప్రతిరోజూ చెరువు నుంచి మట్టిని తరలించి విక్రయిస్తున్నారని చెబుతున్నారు. ఈ వ్యవహారంలో అధికార పార్టీకి చెందిన ఓ స్థానిక నాయకుడి పాత్ర ఉందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని, ప్రశ్నించిన వారిని బెదిరిస్తున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. "నాకు ఎమ్మెల్యే అండ ఉంది, నన్నెవరూ అడ్డుకోలేరు" అంటూ సదరు నాయకుడు అధికారులకే సవాల్ విసురుతున్నట్లు ఆరోపిస్తున్నారు. చెరువు పరిరక్షణకు వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఇలాంటి ఘటనలు అధికార పార్టీ ప్రతిష్ఠకు భంగం కలిగిస్తాయని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. రాబోయే పంచాయతీ ఎన్నికలపై కూడా దీని ప్రభావం పడే అవకాశం ఉందని అంటున్నారు. సంబంధిత అధికారులు విచారణ చేపట్టి నిజానిజాలు వెలికి తీయాలని గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అక్రమ మట్టి తవ్వకాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

# నాయుడుపేటలో ప్రజా దర్బార్

## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం-ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ



నాయుడుపేట,పెన్ పవర్, జూలై 3 సూళ్లూరుపేట నియోజకవర్గంలో క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం గా ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ తెలియజేశారు. శుక్రవారం నాయుడుపేట మున్సిపాలిటీ కార్యాలయంలో జరిగిన ప్రజా వేదిక కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీని స్థానిక నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రజల నుండి వారి సమస్యల పరిష్కారం కోసం అందించిన వినతి పత్రాలను స్వీకరించారు. ప్రజా వేదిక ద్వారా అందిన అర్జీలను సంబంధిత వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆర్థిక సంక్షోభంలో ఉన్న రాష్ట్రాన్ని గాడిలో పెట్టేందుకు నిరంతరం కృషి చేస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆశయాలకు అనుగుణంగా అధికారులు పనిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నాయుడుపేట పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు షేక్ రఫీ,శ్రీ పోలేరమ్మ ఆలయ కమిటీ చైర్మన్ నానబాల సుబ్బారావు, తెలుగుదేశం పార్టీ నాయకులు ఆమవరపు సత్యం,పలుకూరు ముత్యాలయ్య,అవధానం సుధీర్,నిత్య కృష్ణారెడ్డి, కాపులూరు చక్రపాణి,బల్లి ముత్యాలయ్య,మైలారి అశోక్, వినుకొండ ధనుంజయ,ఇమ్మిడిశెట్టి వెంకటేశ్వర్లు,చేవూరు చెంగయ్య, నాగరాజు,తదితరులు పాల్గొన్నారు.

# టమోటా రైతుల ఆగ్రహం



పలమనేరు,పెన్ పవర్,జూలై03 గిట్టుబాటు ధర లభించడం లేదంటూ పలమనేరులోని మార్కెట్యార్డు వద్ద శుక్రవారం టమోటా రైతులు ఆందోళనకు దిగారు. ఉదయం వీరు మార్కెట్యార్డు ఎదుట జాతీయ రహదారిపై బైఠాయించారు. యార్డుకున్న రెండు గేట్లు మూసివేసి, వాహనాలను అడ్డుపెట్టారు. మార్కెట్ కమిటీ చైర్మన్ రావాలంటూ రైతులు నినాదాలు చేశారు. మార్కెట్ కమిటీ కార్యదర్శి సంజీవకుమార్ నచ్చజెప్పేందుకు ప్రయత్నించారు. మార్కెట్యార్డులో వ్యాపారులు సిండికేట్గా ఏర్పడి టమోటాకు సరైన ధర లేకుండా చేశారని ఆగ్రహించారు. పొరుగు మార్కెట్ యార్డులతో పోల్చితే బాక్సుకు రూ.30 తేడా ఉంటోందన్నారు. రెండేళ్లుగా టమోటాలకు ధరలు లేక అప్పులు పాలవుతున్నామని వాపోయారు. ఇక్కడ వ్యాపారుల వైఖరే ధరల పతనానికి కారణమని విమర్శించారు. మార్కెట్యార్డు చెర్మన్ రాజన్న స్థానికంగా లేరని, రైతులతో సమావేశం నిర్వహిస్తామని కార్యదర్శి చెప్పడంతో ఆందోళన విరమించారు.

# నాయుడుపేట ఆర్టీసీ బస్టాండ్ కు తిరుపతి,నెల్లూరు బస్సులను విరివిగా నడపాలి



నాయుడుపేట,పెన్ పవర్,జూలై 3 తిరుపతి నెల్లూరు చెన్నై మహానగరాలకు కూడలి ప్రాంతమైన నాయుడుపేట ఆర్టీసీ బస్టాండ్ లో సూపర్ లగ్జరీ,డీలక్స్, ఎక్స్ప్రెస్ బస్సులకు స్టాపింగ్ సౌకర్యం కల్పించాలని కోరుతూ టిడిపి నేత,ఎస్ జువలరీస్ అధినేత పోట్లపూడి రాజేష్ ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ కి వినతి పత్రం అందజేశారు. శుక్రవారం నాయుడుపేట మున్సిపాలిటీ కార్యాలయంలో జరిగిన ప్రజా వేదిక కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా టిడిపి నేత పోట్లపూడి రాజేష్ ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నాయుడుపేట ఆర్టీసీ బస్టాండ్ నుండి తిరుపతి నెల్లూరు నగరాలకు అతికొద్ది బస్సులు మాత్రమే నడుస్తున్నాయని తెలిపారు. నాయుడుపేట రేణిగుంట సిక్స్ లైన్ రహదారి ప్రారంభమైన నాటి నుండి నాయుడుపేట బస్టాండుకు సూపర్ లగ్జరీ,డీలక్స్ ఎక్స్ప్రెస్ బస్సులు రాకపోకలు తగ్గాయని తెలిపారు. తిరుపతి,నెల్లూరు నగరాల నుండి ప్రయాణం సాగించే బస్సులు నాయుడుపేట వద్ద బైపాస్ రోడ్డు పై వెళ్లిపోతున్నందువల్ల స్థానికులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆయన తెలిపారు. ఎమ్మెల్యే చొరవ చూపి అధిక సంఖ్యలో నాయుడుపేట బస్టాండ్ లో సూపర్ లగ్జరీ, ఎక్స్ప్రెస్,డీలక్స్ బస్సులకు స్టాపింగ్ సౌకర్యం కల్పించాలని ఆయన కోరారు.

# ఎస్ ఐ ఆర్ ప్రక్రియ వేగవంతం

## ఇప్పటివరకు 97% ఎన్యుమరేషన్ ఫామ్స్ పంపిణీ చేయడం జరిగిందని జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు తెలిపారు.





బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవన్ జూలై 3. ఈ మేరకు పట్టణంలోని మున్సిపల్ కార్యాలయాన్ని ఆయన సందర్శించి సర్ ప్రక్రియ జరుగుతున్న తీరుపై కమిషనర్ చినబాబుతో చర్చించారు. అనంతరం బుచ్చి - 3 సచివాలయాన్ని ఆయన తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 97% లో 36% డిజిటలైజేషన్ పూర్తయిందని చెప్పారు.కోవూరు నియోజవర్గంలో ఎన్యుమరేషన్ ఫామ్స్ 97.69% పంపిణీ చేయగా 38.4%డిజిటలైజేషన్ పూర్తయిందన్నారు.బుచ్చి మండలం లో 96% ఎన్యుమరేషన్ ఫామ్స్ పంపిణీ చేయగా 40%డిజిటలైజేషన్ పూర్తయిందన్నారు. ఈ నెల 14వ తేదీలోపు సర్ ప్రక్రియను 100% పూర్తి చేసే విధంగా అధికారులకు ఆదేశాలు జారీ చేశామని చెప్పారు.

ఈ కార్యక్రమంలో చైర్పర్సన్ మోర్ల సుప్రజ, మండల తాసిల్దార్ అంబటి వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

# టు వీలర్స్ మెకానిక్ డే





బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ జూలై 3. బుచ్చిరెడ్డిపాలెం పట్టణంలో టూ వీలర్స్ మెకానిక్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మెకానిక్ డే ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్టేట్ వైస్ ప్రెసిడెంట్ యండి. బద్రుద్దీన్, జిల్లా సెక్రటరీ పఠాన్ నజీర్ పాల్గొని కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. వారు మాట్లాడుతూ.. అందరు సమక్షంలో మెకానిక్ డే జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. మండలంలోని మెకానిక్లు అందరూ ఐక్యంగా కలిసి పనిచేస్తామన్నారు. ప్రతి ఒక్కరు సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో పాల్గొన్న బుచ్చి గౌరవ అధ్యక్షుడు రూప్ సింగ్, మండల ప్రెసిడెంట్ షేక్ షబ్బీర్, టౌన్ పట్టణ ఇన్చార్జి యస్ దాని , మండల వైస్ ప్రెసిడెంట్ యం డి. బషీర్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# కడప ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు కర్త, కర్మ, క్రియ అన్నీ చంద్రబాబే : ప్రత్తిపాటి

## జగన్ రెండుసార్లు శంకుస్థాపనలు చేసి.. తన రాజకీయ ప్రయోజనాలు నెరవేర్చుకున్నాడు ఉత్తుత్తి శంకుస్థాపనలు తప్ప.. ఉత్పత్తి, ఉపాధి కల్పనపై జగన్ దృష్టి పెట్టలేదు.

చిలకలూరిపేట , పెన్ పవర్, జూలై 03 : చిలకలూరిపేట : కడప జే.ఎస్.డబ్ల్యూ ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణానికి కూటమిప్రభుత్వం కీలక సహాయసహకారాలు అందించింది. ప్రభుత్వం వైపు నుంచి అందాల్సిన అనుమతులు, భూ కేటాయింపులు, కేంద్ర ప్రభుత్వ సమన్వయం అంశాల్లో వేగంగా నిర్ణయాలు తీసుకుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు పట్టుదల, నిబద్ధత, ముందుచూపు వల్లే నేడు ప్రాజెక్ట్ నిర్మాణం దిశగా వేగంగా తొలి అడుగులు పడ్డాయి. ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటుకోసం కూటమి ప్రభుత్వం జే.ఎస్.డబ్ల్యూ సంస్థకు జమ్మల మడుగు మండలం సున్నపురాళ్లపల్లె, పెదండ్లూరు గ్రామాల పరిధిలో 1,100 ఎకరాల భూమిని కేటాయించింది. ప్రాజెక్టు నిర్మాణం, కార్యకలాపాలకు నీటి ఇబ్బంది లేకుండా గండికోట రిజర్వాయర్ నుంచి పైప్ లైన్ ద్వారా నీటి సరఫరాకు ఏర్పాట్లు చేసింది. 220 కే.వీ సబ్ స్టేషన్ ఏర్పాటుతో విద్యుత్ సౌకర్యాన్ని అందించింది. ఎన్.హెచ్-67, ముద్దనూరు రైల్వేస్టేషన్ ను అనుసంధానిస్తూ రవాణా మార్గాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. కేంద్రప్రభుత్వంతో సంప్రదింపులు జరిపి సకాలంలో పర్యావరణ అనుమతులు ఇప్పించింది. ఈ విధంగా ప్రాజెక్టు నిర్మాణానికి అవసరమైరన సంపూర్ణ సహాయసహకారాల అందజేతలో కూటమిప్రభుత్వం చురుగ్గా, వేగంగా స్పందించింది. కడప ఉక్కుఫ్యాక్టరీ ఏర్పాటు కర్త, కర్మ, క్రియ చంద్రబాబే.

రూ.16,350 కోట్ల భారీ పెట్టుబడితో వేలాది ఉద్యోగ, ఉపాధి అవకాశాలు

రాయలసీమ ప్రాంత అభివద్ధి, స్థానిక యువతకు ఉపాధి కల్పన పట్ల ప్రభుత్వం ఎంత చిత్తశుద్ధితో ఉందో చెప్పడానికి ఉక్కుఫ్యాక్టరీ నిర్మాణం మరో గొప్ప నిదర్శనం. రూ.16,350 కోట్ల భారీ పెట్టుబడితో ఏర్పాటుకానున్నజే.ఎస్.డబ్ల్యూ స్టీల్ ప్లాంట్ తో వేలమందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. రెండుదశల్లో 2,500 ఉద్యోగాలు ఇస్తామని ఇప్పటికే సంస్థ యాజమాన్యం ప్రకటించింది. ఈ విధంగా పెట్టుబడులు ఆకర్షణ, ఉపాధి కల్పన, ప్రభుత్వ ఆధాయ మార్గాల పెంపులో చంద్రబాబు సర్కార్ అడుగడుగునా తన నిజాయితీని, నిబద్ధతను చాటుకుంటోంది.

జగన్ హయాంలో ఉత్తుత్తి శంకుస్థాపనలు తప్ప.. ఉత్పత్తి దిశగా అడుగుపడలేదు.

రాయలసీమ బిడ్డనని ప్రగల్భాలు పలికే జగన్.. కడప ఉక్కు ఫ్యాక్టరీని రాజకీయ ప్రయోజనాంశంగా చూశాడు తప్ప.. తన ప్రాంతానికి, యువతకు మేలు చేయాలనే ఆలోచన చేయలేదు. ముఖ్యమంత్రిగా ఓట్లకోసం ఉత్తుత్తి శంకుస్థాపనలతో సరిపెట్టాడు తప్ప. ఉత్పత్తి దిశగా ఒక్క అడుగుపడేలా ఆయన ఎలాంటి నిర్ణయాలు తీసుకోలేదు.



2019లో మొదటిసారి, 2023లో ఇంకోసారి జగన్ కడప ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణానికి శంకస్థాపన చేశాడు. అది కూడా ఆయన సొంత ఆలోచన కాదు. అంతకంటే ముందే రాష్ట్ర విభజనానంతరం ముఖ్యమంత్రిగా భాధ్యతలు చేపట్టిన చంద్రబాబు 2018లో తొలిసారి కంబాలదిన్నెలో స్టీల్ ప్లాంట్ నిర్మాణపనులకు భూమిపూజ చేశారు. రాష్ట్ర పునర్విభజన చట్టం హామీ ప్రకారం కడపలో సెయిల్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటుదిశగా నాడు చంద్రబాబు చొరవ చూపారు. 2019లో వైసీపీ ప్రభుత్వ ఏర్పాటుతో ప్రాజెక్టు నిర్మాణం అటకెక్కింది. మరలా ఇన్నేళ్లకు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక చొరవ, పట్టుదలతో జే.ఎస్.డబ్ల్యూ సంస్థ కడపలో స్టీల్ ప్లాంట్ నిర్మాణానికి ముందుకొచ్చింది. ఉక్కుఫ్యాక్టరీ నిర్మాణాన్ని జగన్ కేవలం ఎన్నికల అంశంగా చూశాడు తప్ప.. నిజంగా రాష్ట్రానికి పెట్టుబడులు, యువతకు ఉపాధి కల్పించాలనే ఆలోచన చేయలేదు." అని ప్రత్తిపాటి శుక్రవారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు.

# చిలకలూరిపేటలో మున్సిపల్ కమిషనర్ తనిఖీలు.

## ఎస్ఐఆర్ ప్రక్రియపై అధికారులకు దిశానిర్దేశం.

చిలకలూరిపేట , పెన్ పవర్, జూలై 03 : చిలకలూరిపేట: పట్టణంలోని వివిధ వార్డుల్లో చేపట్టిన ఎస్ఐఆర్ ప్రక్రియను మున్సిపల్ కమిషనర్ పి.శ్రీహరి బాబు క్షేత్రస్థాయిలో పరిశీలించారు.పట్టణ అభివృద్ధిలో భాగంగా జరుగుతున్న ఈ సర్వేను వేగవంతం చేయాలని ఆయన సిబ్బందిని ఆదేశించారు.

పర్యటించిన వార్డులు..

మున్సిపల్ కమిషనర్ తన పర్యటనలో భాగంగా పట్టణంలోని 17, 18, 19, 20, 23, 25, 26 మరియు స్వర్ణ వార్డుల్లో పర్యటించి, ఇంటింటికీ జరుగుతున్న సర్వే తీరును స్వయంగా తనిఖీ చేశారు.సర్వేలో భాగంగా సిబ్బంది సేకరిస్తున్న వివరాలను ఆయన ఆరా తీశారు.

అధికారులకు కీలక సూచనలు..



ఈ సందర్భంగా కమిషనర్ శ్రీహరి బాబు మాట్లాడుతూ, ఎస్ఐఆర్ ప్రక్రియలో ఎటువంటి పొరపాట్లు జరగకుండా పక్కాగా వివరాలు నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈకార్యక్రమాన్ని బాధ్యతాయుతంగా పూర్తి చేయాలని, ప్రజల నుంచి వస్తున్న స్పందనను, సమస్యలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్తో పాటు సంబంధిత వార్డుల ఏ ఈ,ఆర్వో మరియు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలి :జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్,వి

బాపట్ల ( పెన్ పవర్),జులై 03 : బాపట్ల జిల్లా చీరాల ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ తెలిపారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ సర్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రాత్రి చీరాల మున్సిపాలిటీ పరిధి యాదవ పాలెం, రజక పేట, జరుగుతున్న సర్ ఇంటింటా సర్వే ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు 2002 ఓటర్ల జాబితాను 2025 ఓటర్ల జాబితాకు ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియ నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని బి యల్ ఓ ను ఆదేశించారు. యాదవ పాలెం, రజక పేట, జరుగుతున్న సర్ ఇంటింటా సర్వే ని



జిల్లా కలెక్టర్ ఓటరు మ్యాపింగ్ ప్రక్రియను పరిశీలించారు. బి ఎల్ ఓ పరిధిలో ఎంతమంది ఓటర్లు ఉన్నారు ఎంతవరకు జరిగింది మొదలగు వివరాలను బి యల్ ఓ ను అడిగి తెలుసుకున్నారు. మ్యాపింగ్ ప్రక్రియ వేగంగా చేపట్టాలని, రోజుకు 75 మందిని మ్యాపింగ్ చేయాలని, బిఎల్ఓ కు మరొకని సహాయకులుగా ఏర్పాటుచేసి నిరంతరం పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

# చిలకలూరిపేటలో జోరుగా జనసేన రాజకీయం..

## బాలినేని శ్రీనివాసరెడ్డికి ఘన స్వాగతం!.

చిలకలూరిపేట , పెన్ పవర్, జూలై 03 : చిలకలూరిపేట : నరసరావుపేట పార్లమెంట్ నియోజకవర్గ జనసేన పార్టీ నిర్మాణ సారథుల పరిశీలకులు, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి చిలకలూరిపేటలో పర్యటించారు.ఈ పర్యటన జనసేన శ్రేణుల్లో నూతనోత్సాహాన్ని నింపింది.జనసేన యువ నాయకులు మండలనేని చరణ్ తేజ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాలు పార్టీ బలాన్ని చాటిచెప్పాయి.

అట్టహాసంగా బైక్ ర్యాలీ...


గురువారం సాయంత్రం చిలకలూరిపేట చేరుకున్న బాలినేని శ్రీనివాసరెడ్డికి, నరసరావుపేట - చిలకలూరిపేట బైపాస్ రోడ్డు వద్ద జనసేన నాయకులు,కార్యకర్తలు భారీ బైక్ ర్యాలీతో స్వాగతం పలికారు. అరగంటకు పైగా కొనసాగిన బాణసంచా మోతలతో పట్టణం మార్మోగిపోయింది. దారిపొడవునా కార్యకర్తలు పూల వర్షం కురిపిస్తూ తమ అభిమానాన్ని ప్రదర్శించారు.ఈ సందర్భంగా చరణ్ తేజ, బాలినేనిని ఘనంగా సత్కరించారు.

మున్సిపల్ ఎన్నికలే లక్ష్యం..

ర్యాలీ అనంతరం శ్రీనివాస కళ్యాణ మండపంలో జరిగిన సభలో బాలినేని శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ,చిలకలూరిపేటలో జనసేన పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని,చిలకలూరిపేట గడ్డపై జనసేన జెండాను రెపరెపలాడించాలని దిశానిర్దేశం చేశారు.

చరణ్ తేజపై ప్రశంసల జల్లు..

ఈ సందర్భంగా యువ నాయకుడు మండలనేని చరణ్ తేజను బాలినేని



ప్రత్యేకంగాఅభినందించారు.చరణ్ తేజ స్వార్థం లేని వ్యక్తి అని,పార్టీ కోసం తెరవెనుక ఉంటూ నిరంతరం శ్రమిస్తున్నారని కొనియాడారు.పార్టీ అధినేత,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఇచ్చిన మాటను గౌరవించడంలో చరణ్ తేజ చూపిన చిత్తశుద్ధిని బాలినేని గుర్తు చేశారు. ఢిల్లీ పర్యటనలో పవన్ కళ్యాణ్ స్వయంగా చరణ్ తేజను పిలిపించి అభినందించడం ఆయన అంకితభావానికి నిదర్శనమని పేర్కొన్నారు.రాష్ట్ర భవిష్యత్తు రాజకీయాలకు చరణ్ వంటి యువ నాయకుల అవసరం ఎంతైనా ఉందని ఆయన వ్యాఖ్యానించారు.

క్రమశిక్షణే జనసేన బలం.

జనసేన అంటేనే క్రమశిక్షణకు మారుపేరని, పవన్ కళ్యాణ్ ఆశయాలకు అనుగుణంగా ప్రతి కార్యకర్తనడుచుకోవాలని బాలినేని కోరారు.అనంతరం జరిగిన ఫోటో సెషన్లో జనసైనికులు,వీర మహిళలతో కలిసి ఉత్సాహంగా పాల్గొనడంతో కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

# సర్ విధుల్లో అలసత్వం నలుగురు అధికారులకు షోకాజు నోటీసులు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

విజయవాడ, పెన్ పవర్, జులై, 03, ప్రజాస్వామ్య వ్యవస్థకు కీలకమైన, విలువైన ఓటు భద్రతకు అత్యంత ముఖ్యమైన ఓటర్ల జాబితా సమగ్ర సవరణ (సర్) కార్యక్రమం విధుల్లో అలసత్వం ప్రదర్శించినందుకు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ నలుగురు అధికారులకు శుక్రవారం షోకాజు నోటీసులు జారీచేశారు. విజయవాడ పశ్చిమ నియోజకవర్గం ఈఆర్వో ఎ.రవీంద్ర, ఏఈఆర్వోలు ఇస్మాయిల్, డి.చంద్రబోస్లతో పాటు విజయవాడ మధ్య నియోజకవర్గం ఏఈఆర్వో సంజయ్ రత్నకుమార్ లకు షోకాజు నోటీసులు జారీచేశారు. సర్ ఎన్యూమరేషన్ ఫారాల డిజిటైజేషన్ ప్రక్రియలో పురోగతి చూపడంలో విఫలమైనందుకు ఈ నోటీసులు ఇచ్చారు. ఈసీఐ మార్గదర్శకాలకు అనుగుణంగా చేపట్టిన సర్ ప్రక్రియ అత్యంత కీలకమైందని.. ఈ విధుల్లో




ఎలాంటి అలసత్వం లేదా నిర్లక్ష్యం సహించబోమని, బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిన అధికారులపై కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ లక్ష్మీశ హెచ్చరించారు.

# వేతన సవరణ కమిషన్ నియామకాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లండి ఏపీజేఏసీ

విజయవాడ, పెన్ పవర్, జులై, 03, ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులు, పెన్షనర్ల దీర్ఘకాలిక సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించడంతో పాటు వేతన సవరణ కమిటీని నియమించే విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, ఉద్యోగులకు న్యాయం జరిగేలా చూడాలని ఏపీ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల జాయింట్ యాక్షన్ కమిటీ (ఏపీ జేఏసీ) జిల్లా నాయకులు శుక్రవారం సెంట్రల్ ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావును కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా జేఏసీ చైర్మన్ డి. సత్యనారాయణ రెడ్డి నేతృత్వంలో ఎమ్మెల్యేను కలిసిన ప్రతినిధి బృందం ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లింది. వెంటనే పీఆర్సీ కమిటీని నియమించి మధ్యంతర భృతి (ఐఆర్) ప్రకటించే అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ఉద్యోగుల ఆరోగ్య భద్రత కోసం హెల్త్ కార్డుల వ్యవస్థను పూర్తిస్థాయిలో అమలు చేయాలని కోరారు. అలాగే సరెండర్ లీవ్, పీఆర్సీ, డీఏ బకాయిలను విడుదల చేయడంతో పాటు సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానం (ఓపీఎస్)ను అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ పరీక్ష నుంచి మినహాయింపు కల్పించాలని కూడా కోరారు. జూలై 26లోపు ప్రభుత్వం ఉద్యోగుల ప్రధాన డిమాండ్లపై సానుకూల నిర్ణయం తీసుకోవాలని, లేనిపక్షంలో రాష్ట్ర జేఏసీ కార్యవర్గ సమావేశంలో తదుపరి ఉద్యమ కార్యాచరణను ప్రకటిస్తామని స్పష్టం చేశారు. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు నోషనల్ ఇంక్రిమెంట్లు, ఆటోమేటిక్ అడ్వాన్స్మెంట్ స్కీమ్ (ఏఏఎస్) అమలు చేయాలని, కాంట్రాక్ట్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని జేఏసీ నాయకులు విజ్ఞప్తి చేశారు. పెన్షనర్లకు బకాయిల చెల్లింపు, అదనపు క్వాంటం పెన్షన్ పునరుద్ధరణ వంటి అంశాలను కూడా ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. గత ప్రభుత్వం ఉద్యోగులను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని.. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఉద్యోగులకు సక్రమంగా జీతాలు చెల్లించడం,ఉద్యోగులపై నమోదైన కేసులను ఎత్తివేయడం, రూ. 21 వేల కోట్ల బకాయిలు చెల్లించడం, కార్పొరేషన్లు, ప్రభుత్వరంగ సంస్థల ఉద్యోగుల వయోపరిమితిని 62 ఏళ్లకు పెంచడం వంటి కీలక నిర్ణయాలు తీసుకోవడం జరిగిందని.. అయితే అత్యంత కీలకమైన పీఆర్సీ కమిషన్‌ను



నియమించడంలో జరుగుతున్న జాప్యంపై ఉద్యోగుల్లో అసంతృప్తి ఉన్న విషయాన్ని గుర్తించి వీలైనంత త్వరగా సానుకూల నిర్ణయం తీసుకోవాలని కోరుతున్నట్లు తెలిపారు. వినతిపత్రాన్ని స్వీకరించిన ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, పెండింగ్‌లో ఉన్న సమస్యలను దశలవారీగా పరిష్కరించే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా పెన్షనర్ల సంఘం అధ్యక్షులు నారాయణరావు, కార్యదర్శి విష్ణువర్ధన్‌రావు, రాజారావు, ఆర్టీసీ ఎన్ఎంయూ నాయకులు సీహెచ్. రామకృష్ణ, జేఏసీ విజయవాడ నగర శాఖ చైర్మన్ సీహెచ్. సీవీఆర్ ప్రసాద్, జిల్లా నర్సెస్ అసోసియేషన్ అధ్యక్షురాలు షమా బేగం, వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు జి.రామకృష్ణ, బి. సతీష్ కుమార్, షేక్ నజీరుద్దీన్, డి.ఎస్.ఎన్. శ్రీనివాస్, సయ్యద్ ఖాసిం, దుర్గాప్రసాద్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు సుందరయ్య, నయీమ్ అహ్మద్, వి.రాధిక, మహ్మద్ ఇక్బాల్, సూరిబాబు, పి. కోటేశ్వరరావు, బాబురావు, సాయి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# మంగళగిరి ఆలయ అభివృద్ధికి మరో ముందడుగు మంత్రి నారా లోకేష్

గుంటూరు, పెన్ పవర్, జులై, 03, శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానం దిగువ సన్నిధిలో రూ.6.50 కోట్ల వ్యయంతో నిర్మించనున్న అత్యాధునిక యాగశాల నిర్మాణ పనులకు రాష్ట్ర విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ శుక్రవారం భూమి పూజ చేశారు.ఆలయ అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా చేపట్టిన ఈ యాగశాల నిర్మాణం పూర్తయిన అనంతరం యాగాలు, హోమాలు, ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలను మరింత విశాలమైన, ఆధునిక వసతులతో నిర్వహించే అవకాశం కలుగుతుందని అధికారులు తెలిపారు. భక్తులకు మెరుగైన సేవలు అందించడంతో పాటు ఆలయ ఆధ్యాత్మిక వైభవాన్ని మరింత పెంపొందించే దిశగా ఈ నిర్మాణం ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. భూమి పూజ



కార్యక్రమంలో దేవాదాయ శాఖ కమిషనర్, దేవస్థానం అధికారులు, ప్రజాప్రతినిధులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు

# మీ వద్దకు--మీ గళ్ళమాధవికార్యక్రమం

గుంటూరు, పెన్ పవర్, జులై, 03, గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టే ఉద్దేశంతో నిర్వహిస్తున్న "మీ వద్దకు -- మీ గళ్ళా మాధవి" కార్యక్రమంలో భాగంగా 3వరోజు ఎమ్మెల్యే ద టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యురాలు గళ్ళా మాధవి 49వ డివిజన్‌లోని 116వ బూత్ పరిధిలో విస్తృతంగా పర్యటించారు.ఈ సందర్భంగా పీ.ఎస్. నగర్ 1, 2, 3, 4 లైన్లలో ఇంటింటికి వెళ్లి స్థానిక ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీ సమస్యలు, వీధి దీపాల కొరత, వీధి కుక్కల బెడద వంటి సమస్యలను స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ప్రజల ఫిర్యాదులపై స్పందించిన గళ్ళా మాధవి సంబంధిత అధికారులతో మాట్లాడి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదేవిధంగా వేళంగిని నగర్ ప్రధాన రహదారి, కొండయ్య కాలనీ ప్రధాన రహదారులను విస్తరించాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరగా, వెంటనే స్పందించిన ఎమ్మెల్యే ఎస్సీ, సీపీ, టౌన్ సర్వేయర్‌లను పిలిచి రహదారి విస్తరణకు అవసరమైన



చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కొండయ్య కాలనీలో రహదారులు ఇరుకుగా ఉండటంతో అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్ కూడా లోపలికి వెళ్లేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్థానికులు వివరించారు. ప్రజల ప్రాణాలకు సంబంధించిన అంశంగా భావించి వెంటనే సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి అధికారులను ఆదేశించారు. పర్యటన అనంతరం బూత్ పరిధిలోని పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఎమ్మెల్యే సమావేశమయ్యారు. ప్రజల వద్దకే వెళ్లి వారి సమస్యలను తెలుసుకోవడం, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించడం, అర్హులందరికీ పథకాలు చేరేలా చూడడం, అలాగే పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని గళ్ళా మాధవి తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి, ఉపాధ్యక్షులు, క్లస్టర్ మరియు బూత్ కన్వీనర్లు, కో-కన్వీనర్లు, యూనిట్, కో-యూనిట్ నాయకులు, పార్టీసీనియర్ నేతలు,కార్యకర్తలు,స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# విజయవంతంగా ప్రత్యేక గ్రీవెన్స్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌రావు

విజయవాడ, పెన్ పవర్, జులై, 03, ప్రజలకు మరింత చేరువగా పరిపాలన అందించాలనే రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా జిల్లాస్థాయిలో ప్రతి సోమవారం కలెక్టరేట్‌తో పాటు ప్రతి శుక్రవారం నియోజకవర్గ స్థాయిలోనూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు.శుక్రవారం విజయవాడ తూర్పు నియోజకవర్గం పరిధిలోని ఏపీఐఐసీ కాలనీ కల్యాణ మండపంలో ప్రత్యేక గ్రీవెన్స్‌తో పాటు ఒక నెల-ఒక నియోజకవర్గం-నాలుగు సందర్శనలు కార్యక్రమంలో కలెక్టర్ లక్ష్మీశ, స్థానిక శాసనసభ్యులు గద్దె రామ్మోహన్ అధికారులతో కలిసి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మొత్తం 86 అర్జీలు వచ్చాయి. పురపాలక, పట్టణాభివృద్ధి 49, రెవెన్యూ 16, గృహ నిర్మాణం 3, విద్య 3, ఐసీడీఎస్ 3 అర్జీలు రాగా ఏపీఐఐసీ 2, పౌర సరఫరాలు 2 అర్జీలు వచ్చాయి. ఇదే విధంగా వివిధ శాఖలకు సంబంధించి మరో ఎనిమిది అర్జీలు వచ్చాయి. వీటిని క్షుణ్నంగా పరిశీలించి నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమం సందర్భంగా ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ జులై నెలలో విజయవాడ తూర్పు నియోజకవర్గంలో నాలుగు చోట్ల ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజా దర్బార్ ద్వారా కూడా స్థానిక ప్రజల సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషిచేస్తున్నట్లు వెల్లడించారు. కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ ఇప్పటికే మైలవరం, తిరువూరు నియోజకవర్గాల్లో ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించామని.. ఇప్పుడు విజయవాడ తూర్పు నియోజకవర్గంలో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నందుకు ఆనందంగా ఉందన్నారు. ప్రజల నుంచి వచ్చే సమస్యలను నిబద్ధతతో పరిశీలించి సమస్యను నాణ్యంగా అర్జీదారులు సంతృప్తి చెందేలా పరిష్కరించాలనే ధ్యేయంతో పనిచేస్తున్నట్లు పేర్కొన్నారు. నియోజకవర్గ స్థాయిలో కూడా ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమాలను



నిర్వహించడం వల్ల ప్రజలకు సమయం, ప్రయాణ వ్యయం ఆదా కావడంతో పాటు, సమస్యలను స్థానికంగానే త్వరితగతిన పరిష్కరించే అవకాశం కలుగుతుందని తెలిపారు. ప్రజలకు మరింత అందుబాటులో, జవాబుదారీతనంతో కూడిన పరిపాలన అందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు. కార్యక్రమంలో విజయవాడ ఆర్‌డీవో వెన్నెల శ్రీను, పీజీఆర్ఎస్ సమన్వయకర్త జి.జ్యోతి తదితరులు పాల్గొన్నారు..

# ప్రజానాట్యమండలి 9వ మహాసభను జయప్రదం చేయండి

గుంటూరు, పెన్ పవర్, జులై, 03, ఈనెల 5వ తేదీన జరిగేప్రజానాట్య మండలి గుంటూరు జిల్లా 9వ మహాసభన జయప్రదం చేయాలని జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎస్ పద్మ డి శ్రీనివాసరావు ఒక ప్రకటనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల కష్టాలను కన్నీళ్లను పాటలు గా నాటికలుగా మార్చి సమాజాన్ని మేల్కొల్పి, డ్రగ్స్ కు వ్యతిరేకంగా నినదిస్తూ మహిళా సమస్యల పైన కార్మిక సమస్యల పైన నిరుద్యోగ సమస్యల పైన అనేక సమస్యలపై తనవంతుగా పాటుపడుతూ, యువతను విద్యార్థులను,ప్రజలను,చైతన్యం చేస్తూ,




నిత్యం ప్రజా సమస్యలపై గళమెత్తుతున్న ది ప్రజానాట్యమండలి. కావున గుంటూరు జిల్లా 9వ మహాసభ 5/7/2026 ఆదివారం రోజున ఉదయం 10 గంటలకు తాడేపల్లి మేక అమరా రెడ్డి భావన్ లో జరుగుతుంది. కావున కళల పట్ల ఆసక్తి ఉన్న కళాకారులంతా ఈ మహాసభలో పాల్గొని ఈ సభను జయప్రదం చేయవలసిందిగా కోరుతున్నాము.

# హజ్--2026 యాత్ర విజయవంతం హజ్ కమిటీ చైర్మన్ హాజీ షేక్ హసన్ భాషా

విజయవాడ, పెన్ పవర్, జులై, 03, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ హాజీ షేక్ హసన్ భాషా ఈ ఏడాది ఆంధ్రప్రదేశ్ నుంచి విజయవాడ, బెంగళూరు, హైదరాబాద్ ఎంబార్కేషన్ పాయింట్ల ద్వారా సుమారు 2,000 మంది హాజీలు పవిత్ర మక్కా యాత్రకు వెళ్లి, తమ మతపరమైన కార్యక్రమాలను విజయవంతంగా పూర్తి చేసుకుని సురక్షితంగా స్వదేశానికి చేరుకున్నారని పేర్కొన్నారు. మక్కా, మదీనాలలో ప్రార్థనలు ముగించుకుని తిరిగి వచ్చిన హాజీలందరూ యాత్ర ఎంతో ప్రశాంతంగా సాగిందని, ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాలేదని హజ్ కమిటీకి ఫోన్ల ద్వారా తెలియజేశారని చెప్పారు. యాత్ర మొత్తం రాష్ట్ర హజ్ ఇన్‌స్పెక్టర్లు, ఖాదీముల్ హుజ్జాజ్ హాజీలకు నిరంతరం సేవలందిస్తూ అన్ని విధాలా అండగా నిలిచారని వివరించారు. ఎన్నికల హామీ మేరకు విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్ ద్వారా హజ్ యాత్రకు వెళ్లిన ప్రతి అర్హుడైన హాజీకి రూ.1,00,000 ఆర్థిక సహాయం అందజేస్తామని ఇచ్చిన మాటను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిలబెట్టుకున్నారని హాజీ షేక్ హసన్ భాషా తెలిపారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్.ఎం.డి. ఫారూఖ్ ఆధ్వర్యంలో విజయవాడ నుంచి వెళ్లిన 333 మంది అర్హులైన హాజీల వ్యక్తిగత బ్యాంకు ఖాతాల్లో డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ విధానంలో రూ.1 లక్ష చొప్పున జమ చేసినట్లు వెల్లడించారు. ఈ ఆర్థిక సహాయం అందినట్లు హాజీలు స్వయంగా ఫోన్ల ద్వారా ధృవీకరిస్తూ ముఖ్యమంత్రి, రాష్ట్ర ప్రభుత్వానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారని చెప్పారు. పవిత్ర మక్కా భూమిపై రాష్ట్ర ప్రజల సంక్షేమం, ప్రభుత్వ అభివృద్ధి కోసం ప్రత్యేక ప్రార్థనలు



చేసినట్లు హాజీలు పేర్కొన్నారని తెలిపారు. మైనారిటీల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్, ఐటీ, మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్.ఎం.డి. ఫరూఖ్ కు ముస్లిం సమాజం, హాజీలు, రాష్ట్ర హజ్ కమిటీ సభ్యుల తరఫున హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రత్యక్ష పర్యవేక్షణ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

విజయవాడ, పెన్ పవర్, జులై, 03, ఓటర్ల జాబితా సమగ్ర సవరణ ప్రక్రియ (సర్)ను ప్రత్యక్షంగా పరిశీలించేందుకు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ప్రతిరోజూ నియోజకవర్గాల్లో విస్తృతంగా పర్యటిస్తున్నారు.శుక్రవారం విజయవాడ తూర్పు నియోజకవర్గం పరిధిలోని ఏపీఐఐసీ కాలనీలో సర్ ప్రక్రియను పరిశీలించారు. ఎన్యూమరేషన్ ఫారాల డిజిటైజేషన్ ప్రస్తుతం ముమ్మరంగా సాగుతున్న నేపథ్యంలో ఎక్కడా ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా అధికారులు, సిబ్బందికి సూచనలు చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటరు జాబితాలో కచ్చితత్వం ఎన్నికల ప్రక్రియకు అత్యంత కీలకమని, అర్హులైన ఏ ఒక్క ఓటరూ జాబితా బయట లేకుండా.. అనర్హులెవరూ జాబితాలో లేకుండా స్వచ్ఛమైన, సమగ్ర ఓటరు జాబితా రూపకల్పనకు ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) జరుగుతోందని కలెక్టర్ ఈ సందర్భంగా అన్నారు. జిల్లాలో 16,73,496 (97.67 శాతం) ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ జరిగిందని, అదేవిధంగా 6,34,592 (37.04 శాతం) ఫారాల డిజిటైజేషన్



పూర్తయిందన్నారు. ఈ నేపథ్యంలో వేగంగా, కచ్చితత్వంతో డిజిటైజేషన్ ప్రక్రియను ముందుకు నడిపించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. తిరువూరులో 2,03,465 (97.49 శాతం), విజయవాడ పశ్చిమ 2,51,459 (97.85 శాతం), విజయవాడ సెంట్రల్ 2,70,678 (97.43 శాతం), విజయవాడ తూర్పు 2,63,926 (97.85 శాతం), మైలవరం 2,76,608 (97 శాతం), నందిగామ 2,01,677 (97.2 శాతం), జగ్గయ్యపేట 2,05,683 (99.1 శాతం) మేర ఎన్యూమరేషన్ ఫారాలు పంపిణీ చేసినట్లు వివరించారు. బీఎల్‌వోలు, అధికారులు ఈసీనియమనిబంధనలు, మార్గదర్శకాలకు అనుగుణంగా క్షేత్రస్థాయిలో విధులు నిర్వర్తించాలని, ఎలాంటి ప్రభావాలకు తావులేకుండా నిష్పక్షపాతంగా నిబద్ధతతో సర్ ప్రక్రియను విజయవంతంగా పూర్తిచేయడంలో భాగస్వాములు కావాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు.

# ప్రతి అర్జీకి జవాబుదారీగా ఉంటాం ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, పెన్ పవర్, జులై, 03, ప్రజల సమస్యలపై ప్రతినిత్యం అందుబాటులో, ప్రతి అర్జీకి జవాబుదారీగా ఉంటామని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ అన్నారు. శుక్రవారం స్థానిక తూర్పు కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి ఎమ్మెల్యే నసీర్ స్వయంగా అర్జీలు స్వీకరించారు. ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని, రేషన్ కార్డుల్లో మార్పులు చేర్పులు చేపట్టాలని, హౌస్ హెల్డ్ మ్యాపింగ్ లో స్ప్లిట్ ఆప్షన్ ఇవ్వాలని కొందరు అర్జీలు అందజేశారు. స్థానికంగా శానిటేషన్ సక్రమంగా లేదని, విద్యుత్ దీపాలు సక్రమంగా వెలగడం లేదని, రోడ్ల నిర్మాణం చేపట్టాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ వెంటనే సంబంధిత అర్జీలపై అధికారులతో మాట్లాడారు. తక్షణమే పరిష్కారమయ్యే సమస్యలపై చర్యలు తీసుకోవాలని సూచించారు. మిగిలిన అర్జీల పరిష్కారానికి పక్కా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలన్నారు. రాష్ట్రంలో ప్రజలకు ప్రభుత్వ సేవలను అందించేందుకు అంచెలంచెల వ్యవస్థ ద్వారా పని చేస్తున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజల వద్దకే ప్రభుత్వాన్ని తీసుకెళ్లామని చెప్పారు. ప్రతి వారం ప్రజాదర్బార్ మాత్రమే కాకుండా క్షేత్రస్థాయిలో పర్యటన ద్వారా ప్రజల సమస్యలు తెలుసుకుంటున్నామని



అన్నారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో సంక్షేమాన్ని అర్హులకు అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. మొత్తం 67 అర్జీలు దాఖలయ్యాయని చెప్పారు.

# అక్కరకు రాని పార్కింగ్ భవనం

(విశాఖపట్నంపెన్ పవర్,జూలై03 నగరంలో వాహనాల పార్కింగ్ పెద్ద సమస్యగా పరిణమించింది. దీనికి పరిష్కారంగా వీఎంఆర్‌డీఏ సిరిపురం జంక్షన్‌లో 'మల్టీ లెవెల్ కారు పార్కింగ్' (ఎంఎల్‌సీపీ) పేరుతో అందమైన భవనం నిర్మించినా అందులో పార్కింగ్ సదుపాయం ప్రజలకు అందుబాటులోకి తీసుకురాలేదు. ఈ భవనం ప్రారంభించి ఈ ఆగస్టుకు ఏడాది పూర్తవుతుంది. అయినా పార్కింగ్‌కు అనుమతి ఇవ్వడం లేదు. విశాఖలో పార్కింగ్ సమస్య పరిష్కారానికి జీవీఎంసీ జగదాంబ జంక్షన్‌లో ఒక మల్టీ లెవెల్ కారు పార్కింగ్ భవనం నిర్మించి అందుబాటులోకి తీసుకువచ్చింది. దానిని ప్రజలు సక్రమంగా ఉపయోగించుకునేలా ఉన్నతాధికారులు తరచూ తనిఖీలు నిర్వహించి, బయట పార్కింగ్ లేకుండా, వాహనాలు అందులో పెట్టేలా ఆదేశాలు ఇస్తున్నారు. వీఎంఆర్‌డీఏ వద్ద మాత్రం ఆ పరిస్థితి లేదు. పార్కింగ్ కోసమే రూ.88 కోట్లతో ప్రత్యేక భవనం నిర్మించినా అందులో ఇప్పటివరకూ పార్కింగ్‌కు అనుమతి ఇవ్వకపోవడం గమనార్హం. ఆ జంక్షన్‌లో వీఎంఆర్‌డీఏ ఉద్యోగ భవన్‌కు వివిధ పనులపై రోజూ వందలాది మంది వస్తారు.

# ప్రభుత్వ విద్య బలోపేతమే లక్ష్యం ఎమ్మెల్యే నసీర్





గుంటూరు, పెన్ పవర్, జులై, 03, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్ల కాలంలో ప్రభుత్వ విద్యను బలోపేతం చేశామని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. శుక్రవారం స్థానిక బీసీ ఇంటిగ్రేటెడ్ హాస్టల్ లో విద్యార్థులకు దాతల సాయంతో జామంట్రీ బాక్సులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో బీసీ ఇంటిగ్రేటెడ్ హాస్టల్ నిర్మాణానికి ఒక్క తట్ట మట్టి కూడా వేయలేదని మండిపడ్డారు. విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించి విషయంలోనూ తీవ్ర నిర్లక్ష్యం వహించారన్నారు. తాము అధికారంలోకి వచ్చాక మొదటి ఫైల్ గా బీసీ ఇంటిగ్రేటెడ్ హాస్టల్ నిర్మాణం చేపట్టానని చెప్పారు. సీఎం చంద్రబాబు నాయుడు సహకారంతో రూ.4.50 కోట్లతో అత్యాధునిక వసతులతో 260 మంది విద్యార్థులకు సరిపడా బీసీ ఇంటిగ్రేటెడ్ హాస్టల్ నిర్మాణం పూర్తి చేశామని తెలిపారు. హాస్టల్ నుంచి ఉర్దూ బాలుర పాఠశాలకు వెళ్లేందుకు రవాణా సౌకర్యం లేకపోవడంతో ఆర్టీసీ వారితో మాట్లాడి బస్సు ఏర్పాటు చేయించానన్నారు. విద్యార్థులకు జామంట్రీ బాక్సులు లేవని చెప్పడంతో దాతలు మిర్చియార్డు డైరెక్టర్ కొనకళ్ల సత్యనారాయణ, కోట శేషగిరి సహకారంతో 135 మందికి అందించామని చెప్పారు. విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ విద్యావ్యవస్థలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చారని తెలిపారు. ఈ కారణంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ఫొటోలు పేపర్లలోని మొదటి పేజీల్లో ప్రచురితమయ్యే ఫలితాలు సాధించారన్నారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలోని ప్రతి పాఠశాలను సందర్శిస్తూ అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తున్నామని, విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు, మెటీరియల్స్ అందిస్తున్నామని తెలిపారు. పాఠశాలల ప్రారంభానికి ముందే పుస్తకాలు పంపిణీ చేశామన్నారు. మాజీ డిప్యూటీ మేయర్ షేక్ సజీల, విజయ్ కుమార్, ఫారూక్, గోల్డ్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

# పవన్‌పై అనుచిత వ్యాఖ్యలు.. చర్యలకు డిమాండ్

--- సోషల్ మీడియా వ్యాఖ్యలపై సెగ.. పెదన పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు

--- హద్దులు దాటిన వ్యాఖ్యలా..? చర్యలు కోరిన జనసేన

-- వివాదాస్పద వ్యాఖ్యలపై జనసేన పార్టీ నాయకుడు గరికపాటి శివ ఫైర్





పెదన, పెన్ పవర్,జూలై 3 రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌పై యూట్యూబర్ ప్రశ్న రావణ్ చేసినట్లు ఆరోపణలు ఉన్న వ్యాఖ్యలు రాజకీయంగా దుమారం రేపుతున్నాయి. ఈ వ్యవహారంపై ఆగ్రహం వ్యక్తం చేసిన జనసేన నాయకులు శుక్రవారం పెదన పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. జనసేన పార్టీ సీనియర్ నాయకుడు గరికపాటి శివ ఆధ్వర్యంలో నియోజకవర్గ నాయకులు ఫిర్యాదు పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగాహొగరికపాటి శివ మాట్లాడుతూ, ప్రజల చేత ఎన్నుకోబడిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిపై అవమానకరంగా భావిస్తున్న వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్య సంస్కృతిని దెబ్బతీసే చర్య అని విమర్శించారు. సామాజిక మాధ్యమాల వేదికగా వ్యక్తిగత దూషణలు, రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం సమాజానికి ప్రమాదకర సంకేతమని పేర్కొన్నారు. యూట్యూబర్ వ్యాఖ్యలపై వెంటనే కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలపై కఠినంగా వ్యవహరించకపోతే సోషల్ మీడియా వేదికలు బాధ్యతారహిత ప్రచారానికి కేంద్రాలుగా మారే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఫిర్యాదును స్వీకరించిన పోలీసులు చట్టపరంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపినట్లు నాయకులు వెల్లడించారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో

కమలాపురం డిసి చైర్మన్ నల్లమోతు రఘురాం, నియోజకవర్గ మైనారిటీ జనసేన పార్టీ అధ్యక్షులు ఎండి షఫీ, పెదన మండల జనసేన పార్టీ అధ్యక్షులు ఊచా వెంకయ్య నాయుడు, జయలక్ష్మి బ్యాంకు డైరెక్టర్ కూనపురెడ్డి రంగయ్య నాయుడు,జనసేన పార్టీ నాయకులు వరుదు రామకృష్ణ,ఎం. సుబ్బు, వి. చిన్నా గారు,బాఖీ నాని, వేమూరి స్వామి నాయుడు,ఆర్ దుర్గారావు, కొండ,జె. నాగబాబు, డి శ్రీనివాస్,పి భూపతి,కే. సుందర రాజు, మరియు జనసేన పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# 42 ఏళ్ల సుదీర్ఘ వైద్య సేవలకు ముగింపు

సీహెచ్ఓ కె. మల్లయ్యకు ఘనంగా పదవీ విరమణ సన్మానం

కారంపూడి పీహెచ్‌సీ అభివృద్ధికి విశేష కృషి చేసిన వైద్యాధికారికి

సహచరులు, ఆరోగ్య సిబ్బంది, మీడియా మిత్రుల ఘన సన్మానం





పెన్ పవర్ కారంపూడి జూలై 3 :-- పల్నాడు జిల్లా కారంపూడి మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)లో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ (సీహెచ్ఓ)గా విధులు నిర్వహించిన కె. మల్లయ్య శుక్రవారం 42 సంవత్సరాల సుదీర్ఘ వైద్య సేవలకు ముగింపు పలుకుతూ పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా కారంపూడి స్థానిక పద్మావతి కళ్యాణ మండపంలో నిర్వహించిన పదవీ విరమణ మహోత్సవం ఘనంగా జరిగింది. వైద్య రంగంలో నాలుగు దశాబ్దాలకు పైగా సేవలందించిన కె. మల్లయ్యను సహచర వైద్యులు, ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కె. మల్లయ్య మాట్లాడుతూ, తన 42 సంవత్సరాల సేవా కాలంలో ఎన్నో సవాళ్లు, ఒడిదుడుకులు ఎదురైనప్పటికీ ప్రజారోగ్య సేవలను మెరుగుపరచడమే లక్ష్యంగా పనిచేశానని తెలిపారు. కారంపూడి పీహెచ్‌సీని అభివృద్ధి పథంలో నడిపించేందుకు తన వంతు కృషి చేయడం, ప్రజలకు సేవ చేసే అవకాశం లభించడం తనకు ఎంతో సంతృప్తినిచ్చిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కారంపూడి పీహెచ్‌సీ వైద్యులు, ఏఎన్ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు, ఆరోగ్య శాఖకు చెందిన వివిధ విభాగాల సిబ్బంది, గతంలో ఆయనతో కలిసి పనిచేసిన ఉద్యోగులు, ఉన్నతాధికారులు, బంధువులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు పాల్గొని కె. మల్లయ్య అందించిన సేవలను కొనియాడారు. అలాగే, ఏపీయూడబ్ల్యూజే కారంపూడి శాఖకు చెందిన ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా మిత్రులు, జిల్లా ఏపీయూడబ్ల్యూజే సభ్యులు కార్యక్రమంలో పాల్గొని కె. మల్లయ్య దంపతులకు శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన 42 ఏళ్ల సుదీర్ఘ వైద్య సేవలను అభినందిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

# ఎర్రబాలెంలో భారీ డేటా చోరీ




గుంటూరు, పెన్ పవర్, జులై, 03, మంగళగిరి మండలం ఎర్రబాలెం పరిధిలో ఉన్న ప్రముఖ వ్యాపార సంస్థ 'భావనా దయా బెస్ట్ రైస్' లో ఒకే కుటుంబానికి చెందిన దంపతులు అత్యంత చాకచక్యంగా ప్లాన్ వేసి భారీ డేటా చోరీకి పాల్పడ్డారు. ఒకరికొకరు ఏమాత్రం పరిచయం లేని వ్యక్తులుగా నమ్మించి, సంస్థలోని సేల్స్ విభాగంలో ఉద్యోగులుగా చేరిన ఆ భార్యాభర్తలు, సంస్థకు చెందిన వేలాది మంది రెగ్యులర్ కస్టమర్ల ఫోన్ నంబర్లు, ఆర్డర్ల వివరాలు, డీలర్ల నెట్‌వర్క్‌తో కూడిన అత్యంత కీలకమైన వ్యాపార సమాచారాన్ని దొంగిలించారు. డేటా మొత్తం చేతికి చిక్కగానే ఆ ఉద్యోగాలను వదిలేసిన ఆ కేటుగాళ్ళు, తస్కరించిన సమాచారంతో రాత్రికి రాత్రే 'డివిఆర్ రైస్' పేరుతో ఒక కొత్త నకిలీ కంపెనీని ఏర్పాటు చేశారు. అనంతరం భావనా దయా బెస్ట్ రైస్ సంస్థకు ఉన్న నమ్మకమైన కస్టమర్ల నంబర్లకు ఫోన్లు చేస్తూ, తాము ఆ సంస్థ అనుబంధ విభాగం నుంచే మాట్లాడుతున్నామంటూ నమ్మబలికారు. ప్రస్తుతం ఉన్న ధరకంటే చాలా తక్కువ ధరలకే బియ్యం అందిస్తామంటూ నకిలీ బ్రాండ్ 'డివిఆర్ రైస్' ను అంటగడుతూ కస్టమర్లను తీవ్రంగా తప్పుదోవ పట్టిస్తూ వ్యాపారాన్ని దెబ్బతీస్తున్నారు. తమ పాత కస్టమర్లు పక్కదారి పడుతుండటం, వ్యాపార లావాదేవీల్లో తేడాలు రావడం గమనించిన భావనా దయా బెస్ట్ రైస్ అధినేత సుధీర్ బాబు అంతర్గతంగా విచారణ జరపగా, తమ వద్ద గతంలో సేల్స్ విభాగంలో పనిచేసిన దంపతులే ఈ దగాకు ఒడిగట్టారని నిర్ధారణకు వచ్చారు. మోసపోయినట్లు గ్రహించిన సంస్థ అధినేత సుధీర్ బాబు ముందుగా గుంటూరు జిల్లా ఎస్పీని కలసి న్యాయం చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఎస్పీ ఆదేశాల మేరకు ఈ ఫిర్యాదు దర్యాప్తు నిమిత్తం మంగళగిరి రూరల్ పోలీస్ స్టేషన్‌కు చేరింది. తమ సంస్థకు చెందిన కాపీరైట్ డేటాను చోరీ చేసి, నకిలీ బ్రాండ్‌తో కస్టమర్లను మోసం చేస్తున్న నిందితులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, వారి నుంచి డేటాను రికవరీ చేసి తనకు పూర్తి న్యాయం చేయాల్సిందిగా బాధితుడు కోరారు. అదేవిధంగా తమ కస్టమర్లు ఎవరూ కూడా ఇటువంటి నకిలీ బ్రాండ్ రైస్ కొనుగోలు చేసి మోసపోవద్దని, కేవలం అధికారిక నంబర్లను మాత్రమే సంప్రదించాలని సంస్థ తరపున సుధీర్ బాబు విజ్ఞప్తి చేశారు. ఎస్పీ నుంచి వచ్చిన అర్జీ ఆధారంగా కేసు నమోదు చేసిన మంగళగిరి రూరల్ పోలీసులు ఈ వ్యవహారంపై దర్యాప్తు జరుపుతున్నారు.

# మార్కాపురం జిల్లా బిజెపి ఇంచార్జ్ కు కొక్కెర శ్రీనివాస్ యాదవ్ నియామకం



గుంటూరు, పెన్ పవర్, జులై, 03, కొత్తగా నియమితులైన జిల్లా ఇంఛార్జ్?లలో గుంటూరు జిల్లా మేడికొండూరు మండలానికి చెందిన కొక్కెర శ్రీనివాస్ యాదవ్ క్రొత్తగా ఏర్పడిన మార్కాపురం జిల్లాకు ఇంచార్జ్ నియామకం చేసిన రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు పివిఎన్ మాధవ్ అయ్యారు, ఈ సందర్భంగా కొక్కెర శ్రీనివాస్ మాట్లాడుతూ ఒక చిన్న గ్రామం విశదలకు సామాన్య కుటుంబంలో పుట్టిన నన్ను ప్రపంచంలో అతి పెద్ద పార్టీ బిజెపి ఇంత ఉన్నత స్థితికి చేరుకోవడం 28 జిల్లాలలో ఒక జిల్లాకు ఇంచార్జి గా నియామకం చేయడం, చాలా సంతోషంగా ఉందన్నారు, సిద్ధాంతాలకు కట్టుబడి, మన పని మనం చేసుకుంటూ ముందుకు పోతు ఉన్న క్రమంలో ఈరోజు రాష్ట్ర బిజెపి ఇంతటి గొప్ప గౌరవం ఇవ్వడం, చాలా గొప్పగా భావిస్తున్నాను , రాజకీయంగా ఎదగడానికి, మనం కన్న కలలు సాకారం చేసుకోవడానికి ఒకే ఒక్క పార్టీ బిజెపి, మోడీజీ ఒక కటిక పేదరికం లో ఉండి తాను ఒక రైల్వే స్టేషన్ లో టీ అమ్ముకున్న ఒక వెనుకబడిన తరగతుల చెందిన వ్యక్తి ఈరోజు ప్రపంచంలో అతి పెద్ద దేశం భారత్ కు 12 ఏళ్లుగా ప్రధానిగా ఉన్న ఏకైక నాయకుడు మోదీజీ అని, దేశంలో ప్రతి వ్యక్తికి మోడీ జీ ఒక గొప్ప స్ఫూర్తి వంతమైన నాయకుడు అని అన్నారు, అలాంటి పేద వ్యక్తిని దేశ ప్రధాని ని చేసిన గొప్ప సిద్ధాంతం ఉన్న పార్టీ బిజెపి అని, ఇప్పటివరకు పల్నాడు జిల్లాకు గత మూడు సంవత్సరాలుగా ఇంచార్జ్ గా సేవలందిస్తున్న తరుణంలో, క్రొత్తగా ఏర్పడిన మార్కాపురం జిల్లాకు ఇప్పుడు ఇంచార్జిగా నన్ను నియమించడం చాలా సంతోషంగా ఉన్నదని, అత్యంత కీలకంగా వుండే ఈ మార్కాపురం జిల్లాలో నా శక్తి సామర్థ్యాల మేరకు కృషి చేస్తానని, పార్టీ కోసం చురుగ్గా పని చేస్తానని. పార్టీ సిద్ధాంతాలను సామాన్య ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్తానని . బూత్ స్థాయి కమిటీలను మరింత బలోపేతం చేసే విధంగా సంస్థాగత విస్తరణపై ప్రత్యేక దృష్టి సారించే విధంగా గట్టి ప్రయత్నాలు చేస్తానని . సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ముమ్మరంగా చేపట్టే విధంగా నిరంతరం ప్రజా సమస్యలపై స్పందిస్తూ ఆందోళనలు, ఉద్యమాలు నిర్వహించే విధంగా ప్రణాళికలు సిద్ధం చేస్తామని, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలను ప్రజలకు అర్థమయ్యేలా వివరించే విధంగా బిజెపి శ్రేణులను ప్రోత్సహించి నాయకత్వాన్ని బలోపేతం చేస్తామని చెప్పారు, జిల్లా నాయకులతో , ఇతర ప్రజాప్రతినిధులతో ?ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్తామని . జిల్లా , రాష్ట్ర నాయకులు, వివిధ మోర్చాల నాయకులతో కలసి పని చేస్తామని. పార్టీని గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు మరింత పటిష్ఠంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా పని చేస్తామని అన్నారు ఈ సందర్భంగా ఇంత కీలకమైన జిల్లా ఇంచార్జ్ గా నియమించిన బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ కి , రాష్ట్ర సంఘటన ప్రధాన కార్యదర్శి ఎన్ మధుకర్ కి , ధన్యవాదాలు తెలియచేస్తూ, ఈ మార్కాపురం జిల్లా ఇంచార్జ్ బాధ్యతని నా శక్తి సామర్థ్యాల మేరకు పని చేసి పార్టీ బలోపేతానికి, పార్టీ నాయకత్వం పెరిగే విధంగా కృషి చేస్తానని అన్నారు బిజెపి లో అత్యంత ప్రాముఖ్యత ఉన్న జిల్లా ఇంచార్జ్ లను రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు పీవీన్ మాధవ్ రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసే దిశగా నాయకత్వం ఆ పార్టీ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని మరింత పటిష్ఠం చేసేందుకు ఏపీలోని అన్ని జిల్లాలకు నూతనంగా జిల్లా ఇంఛార్జ్?లను నియమించింది. ఇందుకు సంబంధించి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కొత్త నియామకాలు తక్షణమే అమల్లోకి వస్తాయని ఆయన స్పష్టం చేశారు.

# పేటలో ఆధార్ కష్టాలు.. అకస్మాత్తుగా మూతపడిన కేంద్రం




చిలకలూరిపేట , పెన్ పవర్, జూలై 03 : చిలకలూరిపేట : బస్టాండ్ సమీపంలోని పాత బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో ఉన్న ఆధార్ కేంద్రం అకస్మాత్తుగా మూతపడటంతో సామాన్యులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండానే సిబ్బంది కేంద్రానికి తాళాలు వేసి వెళ్లిపోయారు. ప్రభుత్వ పథకాలు, పనులకు ఆధార్ అప్‌డేట్ తప్పనిసరి కావడంతో పట్టణంతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి రోజూ చాలా మంది ఇక్కడికి వస్తుంటారు. తీరా కేంద్రానికి తాళాలు వేసి ఉండటంతో వ్యయప్రయాసలకోర్చి వచ్చిన వృద్ధులు, మహిళలు, చిన్నారులు గంటల తరబడి పడిగాపులు కాసి నిరాశగా వెనుదిరుగుతున్నారు. కనీసం ఎప్పుడు తెరుస్తారో తెలుసుకుందామంటే అక్కడ సిబ్బంది అందుబాటులో లేరు. కనీసం బోర్డుపై సంప్రదించాల్సిన ఫోన్ నెంబర్లు కూడా ఉంచకపోవడంపై ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి, ప్రజలకు ఇబ్బంది కలగకుండా తక్షణమే ఆధార్ సేవలను పునరుద్ధరించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# కొత్తగా 107 పోలింగ్ కేంద్రాలు

శ్రీకాకుళం కలెక్టరేట్,పెన్ పవర్, జూలై3 జిల్లాలో కొత్తగా 107 పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌తో కలిసి వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణపై సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ 'శ్రీకాకుళం నియోజకవర్గంలో 45, ఆమదాలవలసలో 11, ఎచ్చెర్లలో 9, టెక్కలిలో 4, పలాసలో 18, ఇచ్ఛాపురం నియోజకవర్గంలో 20 పోలింగ్ కేంద్రాలు అదనంగా ఏర్పాటు చేయాలని ప్రతిపాదించాం. దీనికి ఎన్నికల సంఘం ఆమోదం లభిస్తే.. జిల్లాలో మొత్తం పోలింగ్ కేంద్రాల సంఖ్య 2,464కు చేరుకుంటుంది. నరసన్నపేట, పాతపట్నం నియోజకవర్గాల్లో ఎటువంటి మార్పులు లేవు. పలాస నియోజకవర్గంలో 7 పోలింగ్ స్టేషన్ల పేర్ల మార్పులతోపాటు ఇచ్ఛాపురంలో ఒకటి, పలాసలో ఒకటి, టెక్కలిలో రెండు, ఆముదాలవలసలో రెండు చొప్పున మొత్తం 6 చోట్ల లొకేషన్ల మార్పులు ప్రతిపాదించామ'ని తెలిపారు. 'జూలై 14 వరకు ఓటర్ల సవరణ ప్రక్రియ నిరంతరాయంగా కొనసాగుతుంది. జూలై 21న ఎలక్టోరల్ డ్రాఫ్ట్ పబ్లికేషన్, ఆగస్టు 20 వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాల స్వీకరణ ఉంటుంది. సెప్టెంబరు 22న తుది జాబితాను ప్రకటిస్తాం. సర్ ప్రక్రియ వివిధ రాజకీయ పార్టీల సహకారంతో సజావుగా జరుగుతోంది. బీఎల్‌వోలు ప్రతీ రోజు బీఎల్ఏలతో సమన్వయ సమావేశాలు నిర్వహించాలి